# పెళ్ళి

మా బాబాయి కూతురు కుసుమ పెళ్ళి !

పెళ్ళి అనే సరికి అది ఎటువంటి పెళ్ళయినా - కుదిర్చిన పెళ్ళయినా ప్రేమ వివాహమయినా.....ఇష్టంగా చేసుకుంటున్నా అయిష్టంగా చేసుకుంటున్నా....పెళ్ళి కూతురు పెళ్ళి కొడుకుల సంగతి ఏమైనా మిగతా వాళ్ళందరికీ కావలసినంత సందడి. హృదయంలో గజ్జల సంగీతం !

కుసుమ బాబాయికి పెద్ద కూతురు. వాళ్ళింట్లో ఇదే మొదటి పెళ్ళి జరగటం. పిన్ని కూడా మరీమరీ రమ్మని రాసింది. ఆయనకి సెలవ దొరికింది. బయలుదేరాం.

మేము వెళ్ళిన రోజునే కుసుమని పెళ్ళి కూతుర్ని చేశారు. దాని మొహంలో గాంభీర్యం, అందం, హుందాతనం అన్నీ వచ్చి చేరుకుని పెళ్ళికూతురు కళ తెచ్చాయి. పేరంటాళ్ళు అందరూ వెళ్ళాక దాని పక్కనే కూర్చున్నాను మంచం మీద.

'' అతనికి ఎన్నేళ్ళే ? '' అన్నాను.

'' ఎవరికి ? '' అంది

''మరీ గొప్పలకిపోకు. పెళ్ళికొడుక్కి!'' అన్నాను నవ్వి.

''పాతిక ముప్పై మధ్య ఉంటాయి!'' అంది.

''చాలా తెలివిగా చెప్పావు. డేటాఫ్ బర్త్ తెలీదూ'' అన్నాను.

అది మాట్లాడలేదు.

''ఏం ఉద్యోగం చేస్తున్నాడు?'' అన్నాను.

''కలకత్తాలో ఏదో కంపెనీలో పని!'' అంది.

''ఏం కంపెనీలో.....ఏం పని?'' అన్నాను.

''ఏదో కంపెనీ! ఏం పని ఐతేనేం! నెలకి నాలుగో ఐదో వందలు వస్తాయిట! నన్ను పోషించలే డంటావా?'' అంది నవ్వుతూ....

నాకేం మాట్లాడాలో అర్థంకాలేదు. గ్రాడ్యుఏటు అయిన మనిషి అట్లాగ మాట్లాడుతోంది ఏమిటి అనిపించింది.

''అసలు అతడిని చూశావా?'' అనడిగాను.

''పెళ్ళి చూపులు అయ్యాయి కదూ'' అంది మళ్ళీ నవ్వుతూ. దాని నవ్వుకి మాటలకి అర్థం అంతుపట్టంలేదు. అసలు ఈ పెళ్ళి దీని ఇష్టం మీద జరుగుతోందా లేదా? లేకపోతే కుసుమకి అసలు ఇష్టాఇష్టాలే లేవా? అనుకున్నాను.

* * * *

మర్నాడు....పెళ్ళి అవుతోంది. పెళ్ళి పందిరి కలకలంగా, కళగా ఉంది. పెళ్ళికొడుకూ పెళ్ళికూతురూ ఎదురెదురుగా కూర్చున్నారు.

బ్రాహ్మడు ఏదో మంత్రాలు చెప్తూ అనమంటున్నాడు. వీళ్ళిద్దరూ అంటున్నారు.

తలమీద జీలకర్ర బెల్లం పెట్టి ప్రమాణాలు చెయ్యటం అయింది. మంగళ సూత్రం కట్టాడు పెళ్ళికొడుకు.

చప్పున చిన్నప్పుడు ఆడుకున్న బొమ్మల పెళ్ళి గుర్తు వచ్చింది.

అంతే ఈ పెళ్ళి కూడా అంతే. బొమ్మల పెళ్ళిళ్ళు!

అప్పుడు మేము ఆడపిల్లలం, రెండు పక్షాలుగాచేరి బొమ్మల్ని కూర్చోపెట్టి పెళ్ళి చేసేవాళ్ళము.

ఇప్పుడు...తండ్రి తన అంతస్థుకి తగ్గ సంబంధం చూసి వరుణ్ణి చూసి తీసుకు వస్తాడు... పెళ్ళిచూపుల తతంగం అవుతుంది. కట్నాలు లాంఛనాలూ మాట్లాడుకుని ముహూర్తం నిశ్చయిస్తారు. పెళ్ళికూతుర్ని, పెళ్ళికొడుకుని కూచోపెడతారు. పెళ్ళికూతురు మెడ వంచుతుంది. పెళ్ళికొడుకు మూడు ముళ్ళు వేస్తాడు. పెళ్ళి అయిపోతుంది. బొమ్మల పెళ్ళి కంటె ఇది ఏ విధంగా వేరు!

ఆ పిల్లకి తన భవిష్యజ్జీవనం గురించి తను జీవితం గడపబోయే అతడి గురించి ఏ అభిప్రాయాలూ ఆశలు ఉండవూ!

అతడికి కాబోయే తన భార్య గురించి ఏ భావనా ఉండదూ!

ఉంటే అభిప్రాయాలు తెలుసుకుని మనసులు విప్పుకోకుండా ఎట్లా పెళ్ళి చేసుకోగలుగుతున్నారు?

మనసుంతో పని లేని పెళ్ళి బొమ్మల పెళ్ళి గాక ఏమిటి?

మనుషుల పెళ్ళి ఇట్లాగ కాదు ఉండవలసింది...! నిట్టూర్చాను. మేళాలు మ్రోగుతుంటే పెళ్ళికూతురూ పెళ్ళికొడుకూ తలంబ్రాలు పోసుకుంటున్నారు. కుసుమ పెదవులు సన్నటి నవ్వుతో విగిర్చాయి. పెళ్ళికొడుకు కుసుమ ముఖంలోకే చూస్తున్నాడు.

చటుక్కున ఎదురుగా చూశాను. ఆయన నా వంకే చూస్తున్నారు... ఆ కళ్ళలోకి చూస్తుంటే నాకు మా పెళ్ళి గుర్తు వచ్చింది.

* * * *

అరుణ పెళ్ళి నిశ్చయమైనప్పటి నుంచి మా స్నేహబృందం అందరికీ ఒకటే తొందర. ముహూర్తం రోజు ఎప్పుడు వస్తుందా అని! పెళ్ళిలో ఎంత సరదాగా గడపాలి. ఎలాగ అల్లరి చెయ్యాలి అని ఎప్పుడూ అవే కబుర్లు. ఎలాగో ఆ పెళ్ళి రోజు వచ్చింది. ముందర రోజే అరుణా వాళ్ళింట్లో హాజరయ్యాము. పెళ్ళికొడుకు ఎట్లాగుంటాడో చూడాలని ఒకటే తొందర!

అడ పెళ్ళివారితో కలిసి స్నాతకానికి వెళ్ళాం. మగ పెళ్ళివారు ఆధునికంగా, సరదాగా ఉన్నారు. మమ్మల్ని కుర్చోపెట్టి మాట్లాడారు. అప్పుడు మేము ఎక్కడికి వెళ్ళినా అక్కడ అందరిలో ఎవరు అందంగా ఉన్నారని వెతుకుతుండే వాళ్ళం. ఆడవాళ్ళందరిలో పెళ్ళికొడుకు అక్క బాగుందని తీర్మానించాము. ఆవిడ భర్త చాలా పొడుగున్నాడు. ''జిరాఫీ'' అని పేరు పెట్టేసింది అనూ.

పెళ్ళికొడుకుని వదలకుండా అంటి పెట్టుకుని కబుర్లు చెప్తున్నా డొకతను.

''అతడు చాలా హేండ్‌సమ్‌గా ఉన్నాడు ధర్మేంద్ర లాగ'' అంది సుధ.

''ఏదోలే అందరిలోకీ కాస్త నయం. మగవాళ్ళకి అందమేమిటిలే' అన్నాను నేను, ఏమీ కుతూహలం లేనట్లు.

''చూడటానికి కళ్ళు లేకపోతే సరి'' అంది సుధ మళ్ళీ.

''ఔ నౌను ధర్మేంద్ర ఏం కర్మ, మన్మధుడిలాగున్నాడు'' అన్నాను నేను పరిహాసంగా.

అతడికి ఆ పేరే స్థిర పడింది అప్పటికే.

''అతడు ఎవరు? పేరేమిటి?'' అని మాలో మేము మధన పడ్డాం కానీ లాభం లేకపోయింది. పట్టు పరికిణీ కట్టుకుని, పన్నీరు బుడ్డీ పట్టుకుని తిరుగుతున్న పెళ్ళికొడుకు చెల్లెల్ని దగ్గరికి పిలిచి అడిగేశాము.

''అతను శ్యాం అన్నయ్య. మా అన్నయ్య బెస్టు ఫ్రెండు'' అని చెప్పింది.

''అంటే అతడు మన అనూకి రైవల్ అన్నమాట'' అనుకుని నవ్వుకున్నాం.

పెళ్ళి చాలా సరదాగా జరిగింది.

ఆ రోజంతా పెళ్ళికొడుకు పెళ్ళికూతురు చుట్టూ చేరీ మేమంతా చాలా సరదాగా గడిపాం. సుధ ఫోటోలు తీసింది.

పెళ్ళికొడుక్కీ మన్మధుడికి సుధ విడిగా ఫోటో తీస్తానంది.

సర్దుకుని కూర్చున్నాక...

''అసలు రీలు ఉందా కెమెరాలో?'' అన్నాడు మన్మధుడు.

''చిరునవ్వులు బాగానే వదులుతున్నాడు కానీ, నిత్యశంకితుడి లాగున్నాడే'' అంది అను నా భుజం పొడుస్తూ.

అందరం కలిసి ఫక్కుమంటే అతడు కంగారు పడ్డాడు. సుధ నొక్కేసింది.

''పాపం జాలేస్తోంది ఆ ఫోటో తలచుకుంటే'' అన్నాను.

''ఏడిశావులే. మహా జాలి గుండె'' అని కసిరింది అనూ.

మా కబుర్లలో సందడిలో నేను ఉన్నా, అతడు నా వైపు పరిశీలనగా ఆసక్తితో చూడటం నేను కనిపెట్టకపోలేదు. అతడు నన్ను చూస్తున్నాడని తెలియగానే నా గుండెల్లో చిరుగజ్జల సవ్వడి ప్రారంభమయింది. అది సన్నాయి మేళానికి, పెళ్ళి పందిరికి దారి తీస్తుందని అప్పుడు నేను అనుకోలేదు.

* * * *

అరుణ భర్త దగ్గరికి వెళ్ళిపోయింది. అతడికి హైదరాబాదులో ఉద్యోగం. అరుణ రాసే ప్రతి ఉత్తరంలోనూ మన్మధుణ్ణి గురించి రాసేది. అట్లాగే నా సంగతు లన్నీ అతడికి చెప్పేదిట. నా పుట్టిన రోజుకి మన్మధుడి సెలెక్షన్ అంటూ రెండు పుస్తకాలు పంపింది. తరువాత కొత్త సంవత్సరపు శుభాకాంక్షలు పంపాడతడు. నేను కూడా గ్రీటింగ్స్ పంపించాను.

మళ్ళీ అరుణ కొడుకు బారసాలలో చూశానతడిని. అరుణ భర్త మాధవ

రావ్‌తో కలిసి వచ్చాడతడు. మళ్ళీ అతడిని చూస్తూంటే ఆత్మీయుడితో పునస్సమాగమం లాగ అనిపించింది. అతడి ఎదుట ఉండటానికి సిగ్గనిపించేది. ఏది మాట్లాడాలన్నా సంకోచం కలిగి నోట మాట వచ్చేది కాదు.

''నన్ను మరిచిపోయినట్లున్నారే.'' అన్నా డతడు నవ్వుతూ.

''లేదు...లేదు..'' అన్నాను నేను తడబడుతూ.

తరవాత మామూలుగా మాటలు సాగాయి.

అతడి అభిప్రాయాలు, ప్రవర్తన నన్ను ఆకర్షించాయి. అసలు అతడికి చాలా విషయాల పట్ల అభిప్రాయాలు ఉండటం నాకు నచ్చింది.

అవి తన ఉద్దేశాలతో కలిసినా కలవకపోయినా...అంటే అతడు ఆలోచిస్తాడని, తెలివైనవాడని అర్థమవుతోంది.

అతడు ఇంకా నాకు దగ్గరైనట్లు అనిపించింది. మళ్ళీ అతడిని చూడలేనని అనుకుంటే మనసులో బాధగా ఉంది.

కొడుకుని తీసుకుని హైదరాబాద్ వెళ్ళాక అరుణ ఊరు చూడటానికి రమ్మని రాసింది. నాన్నని బ్రతిమాలి ఒప్పించాను. మాకు తెలిసిన వాళ్ళు హైదరాబాద్ వెడుతుంటే వాళ్ళతో కలిసి వెళ్ళాను.

నాలుగు రోజులున్నాను అరుణ ఇంట్లో. ఊరంతా తిరిగాము. సాలార్‌జంగు మ్యూజియమ్, చార్‌మినార్, బంజారాహిల్స్, హుసేన్ సాగర్, అబిడ్స్‌తో బాగా పరిచయమైంది. గోల్కొండ, గండిపేట చూశాము. ఒక రోజు సాయంత్రం పబ్లిక్ గార్డెన్స్‌కి వెళ్ళాము.

ఇంచుమించు అన్నిచోట్లకీ శ్యామసుందర్ మాతో వచ్చాడు. హైదరాబాద్ వస్తుంటే మళ్ళీ అతడిని చూస్తాననే భావం మనసులోకి రాగానే ఏదో సంభ్రమంగా ఆనందంగా ఉండేది. మాధవరావ్ సెలవుపెట్టాడు. చాలా సరదాగా గడిచింది.

పబ్లిక్ గార్డెన్స్‌లో కొంచెం సేపు తిరిగాము. ఇంక నడవలేనని అరుణ కూర్చుండిపోయింది. బాబుని చూస్తుంటాను అని మాధవరావ్ కూడా అక్కడే కూర్చుండిపోయాడు.

''నాకు ఇంకా తిరగాలని ఉంది.'' అన్నాను.

నిజంగానే నాకు ఇంకా తిరగాలని ఉంది. అలసట ఎరగని ఉత్సాహం ఉంది, మనసులో.

''ఐతే పదండి'' అన్నాడు శ్యాం.

ఇద్దరం మౌనంగా నడుస్తున్నాం. నామనసులో ఏ ఆలోచనా లేని ఒక ఉత్సాహం.

''ఏమిటి మౌనం.'' అన్నాడతడు నవ్వి.

''చాలా అందంగా ఉంది. ఈ సాయంత్రం ఏం మాట్లాడాలో తెలియటం లేదు.'' అన్నాను.

''పోనీ నన్ను మాట్లాడమంటారా?'' అన్నాడు.

పచ్చగా మెత్తగా ఉన్న గడ్డిలో కూర్చున్నాను నేను.

అతడు కొంచెం దూరంలో కూర్చుని గడ్డి తెంపుతున్నాడు.

''నన్ను మాట్లాడమంటారా రాజీ'' అన్నాడు.

అందరూ నన్ను రాజీ అనే పిలుస్తారు. కానీ అతడు పిలుస్తుంటే కొత్తగా, మధురంగా ఉంది

''ఊ'' అన్నాను.

''మీ పెళ్ళి విషయంలో మీ అభిప్రాయ మేమిటి?'' అన్నాడు.

చప్పున కోపం రాబోయి మళ్ళీ తొందర పడవద్దని మనసు హెచ్చరించింది.

''నా అభిప్రాయంతో మీ కేమైనా పని ఉందా?'' అన్నాను పరిహాసంగా.

''పని ఉంది కనకే. లేకపోతే అటువంటి ప్రశ్న అందరినీ అడగను'' అన్నాడు నా ముఖంలోకి చూస్తూ.

''నాకే అభిప్రాయం లేదు ఇప్పటి వరకూ.'' అన్నాను.

''పోనీ పెళ్ళి చేసుకుంటారు కదా'' అన్నాడు.

''చేసుకోకూడదని నేను నిర్ణయం చేసుకోలేదు.'' అన్నాను.

''మీ అమ్మ నాన్నగారు చెప్పినట్టు చేసుకుంటారు కాబోలు బుద్ధిమంతురాలిగా'' అన్నాడు.

'' నేను బుద్ధిమంతురాలినే, కానీ చిన్న పిల్లని కాదు. నాకు అమ్మ లేదు. నాన్నగారంటే నాకు అభిమానం. ఐనా పెళ్ళి విషయంలో నేను అస్వతంత్రురాలిని కాదు'' అన్నాను.

''ఇంక వెడదామా?'' అన్నాడు.

నాకు నవ్వు వచ్చింది.

''ఎందుకు నవ్వుతున్నారూ?'' అన్నాడు.

''మీరు మాట్లాడటం అయిపోయిందా?'' అన్నాను నవ్వుతూనే. అతను మాత్రం నవ్వలేదు.

''ఇది ప్రారంభం మాత్రమే '' అన్నాడు.

నా మొహంలో నవ్వు ఆగిపోయింది. గుండె వేగంగా కొట్టుకుంది. లేచి గబగబా అడుగులు వేశాను.

ఆ రాత్రి పడుకున్నాక అరుణ నా పక్కలో వచ్చి కూర్చుంది.

''శ్యాం నీ అభిప్రాయం కనుక్కోమన్నాడు'' అంది.

''ఏ అభిప్రాయం?'' అన్నాను.

''శ్యాం నిన్ను ఈ రెండేళ్ళ నుంచి ఆరాధిస్తున్నాడు. అతడి సంగతులన్నీ నీకు తెలుసు.'' అంది.

నాకు లోలోపల ఆనందంగా ఉంది. ఇట్లాగ కావాలని నేను కోరుకుంటున్నదే!

''నేను నిన్ను చూడటానికి వచ్చాను. కాని పెళ్ళి కుదుర్చుకోటానికి రాలేదు.'' అన్నాను.

''ఏమీ ఎరగనట్లు నటించకు. మీ ఇద్దరిదీ చక్కని జంట, మాకు ఈ పెళ్ళి అవాలని ఉంది. కాని మీ నాన్నగారిని గురించి భయంగా ఉంది'' అంది అరుణ.

''మనను ఇచ్చాక పెళ్ళి ఒకటే మార్గం. దానికి ఎవరూ అడ్డు కాలేరు.'' అన్నాను.

''ఐతే అమ్మాయిగారు లొంగిపోయారన్నమాట'' అంది అరుణ సంతోషంగా. చప్పున నేను నా మొహాన్ని రెండు చేతులతోనూ దాచేసుకున్నాను. అరుణ నవ్వుతూ వెళ్ళిపోయింది.

* * * *

మర్నాడు పొద్దున అరుణ వంట గదిలో ఉంది. మాధవరావు ఆఫీసుకి వెళ్ళాడు. నేను స్నానం చేసి వచ్చి వరండాలో జుట్టు ఆరబెట్టుకుంటున్నాను. అతను... శ్యాం వచ్చాడు. మరి ఆఫీసు ఏమయిందో... అతడిని చూడగానే సిగ్గు కలుగుతున్నా, పైకి కనబడనీయకుండా చిరునవ్వుతో పలకరించాను.

''ఇక్కడ కూర్చుందాం రాజీ '' అన్నాడు పూల మొక్కల మధ్య ఉన్న లాన్ చూపిస్తూ. కూర్చున్నాము. మబ్బుమబ్బుగా ఉంది ఆకాశం. చల్లచల్లగా ఉంది గాలి, మోకాళ్ళమీద తల ఆన్చి గడ్డి తెంపుతున్నాను నేను.

''మాధవ్ చెప్పాడు. నీకు అంగీకారమని తెలుసుకుని నాకు చాలా సంతోషంగా ఉంది'' అన్నాడు.

అతడి వైపు చూశాను. అతడు నన్నే చూస్తున్నాడు. నా చూపులు వాలిపోయాయి. మా చుట్టూ ఒక నిశ్శబ్ద సంగీతం అలముకుంటోంది.

అతడూ—నేనూ తప్ప నాకు మిగతా ప్రపంచం మాయమైంది.

చల్లని ఆకాశం క్రింద పచ్చని పచ్చికలో ఆడమ్ అతడు, ఈవ్ నేను. సృష్టికి ఆది ఇదే. ఈ క్షణాలే అనిపించింది.

కనిపించని బంధం ఒకటి నన్ను అతడికి కట్టి పడేస్తోంది. అది నాకు ఇష్టంగా ఉంది.

''నాకూనూ'' అన్నాను.

నా చేతిని తన చేతిలోకి తీసుకున్నా డతడు. నాకు మాటలు రావటం లేదు. ఆ స్పర్శలో నేను బాహ్య జ్ఞానాన్ని కోల్పోతున్నాను. అరుణ ఒక సారి గుమ్మంలోకి వచ్చి చూసి లోపలికి వెళ్ళిపోయింది. అతడు ఏమంటున్నాడో... అట్లాగ ఎంత సేపు కూర్చున్నామో నాకు గుర్తు లేదు.

అంత మాత్రానికే మా పెళ్ళి జరిగి పోయిందనుకోవటం పొరపాటు. అది సమస్యలకి నాంది మాత్రమే. శ్యాంకీ, మాకు కుల భేదం ఉంది. ఆ విషయం నాకు ముందునుంచీ తెలుసు. కానీ అతడితో కలిసి హైదరాబాద్‌లో గడిపాక ఆ భేదం దాటి అతడినే పెళ్ళి చేసుకోవాలని నిశ్చయించుకున్నాను.

ప్రేమ ఒక లోకాతీతమైన విషయమనీ, పూర్వజన్మ సంబంధమనీ నాకేం గొప్ప నమ్మకాలు లేవు. కానీ నాకు పరిచయమైన వారిలో నన్ను గాఢంగా ఆకర్షించుకున్న వ్యక్తి అతడు. అతడిని వదులుకోవటం జీవితానందాన్ని జారవిడుచు కోవటమే ననిపించింది. దానిని రక్షించుకోవటానికి నేను పోరాటం సాగించటానికి సిద్ధపడ్డాను.

స్త్రీ పురుషు లిద్దరు పరస్పరాకర్షితులై, అవగాహన కలిగిఉండి, ప్రేమకి లోనైనప్పుడు కులం, మతం, ధనం వాళ్ళ వివాహానికి అడ్డు కావటంఅనాగరికతకి చిహ్నం. ఎందుకంటే దాంపత్య జీవితానికి ప్రేమ ముఖ్యం. ఆ ప్రేమ కలిగినప్పుడు మిగతా విషయాలు ప్రాముఖ్యం వహించకూడదు.

ఇంటికి వచ్చాక వదినకి చెప్పాను. వదిన అన్నయ్యకి చెప్పింది. అన్నయ్య నాన్నకి చెప్పాడు. తరువాత జరిగిన సంఘటన మామూలే.

అమ్మ పోయినప్పుడు నాన్న చాలా బాధపడ్డారు. నేను, ఇద్దరన్నయ్యలు ఇంకా చిన్న పిల్లలమే...మళ్ళీ పెళ్ళి చేసుకోకుండా మమ్మల్ని చూసుకుంటూనే బ్రతికారు. పెద్దన్నయ్య ఉద్యోగం చేస్తూ నాన్న దగ్గరే ఉండిపోయాడు కానీ, చిన్నన్నయ్య నాన్న ఇష్టానికి వ్యతిరేకంగా ఫారిన్ వెళ్ళి అక్కడ సెటిల్ అయ్యాడు. ఆ బాధ నాన్న మనసులో ఉండిపోయింది.

ఇప్పుడు అన్నయ్య నా సంగతి చెప్పగానే నాన్నకి కోపం వచ్చింది.

''నేనసలు ఉన్నాననుకుందా, లేననుకుందా?'' అన్నారుట.

నాకు ముందర ఏడుపు వచ్చింది కానీ వెంటనే కోపం వచ్చింది.

నేను చేసింది తప్పు కాదు. ఇన్నేళ్ళు వచ్చి, వ్యక్తిత్వం ఏర్పడి నా భర్తని నిర్ణయించుకునే అవకాశం, హక్కు నాకు లేకపోవటం ఏమిటి, అన్యాయం గాక! ఇట్లాగే శాఖ వేరని, కట్నాలని, వంశమని పట్టించుకుని పాత ఆచారాలని పట్టుకుని వేళ్ళాడితే స్త్రీలు చదువుకుని ఏం లాభం? వ్యక్తిత్వం ఏర్పరచుకుని ఏం ప్రయోజనం? జీవిత మింకా దుర్భరం కావటానికి తప్ప! ఈ పిరికితనం లోంచి బయట పడేదెప్పుడు? అదే అన్నాను.

నాన్న నా దగ్గరికి వచ్చి –

"నీ అభిప్రాయం మార్చుకో... నేను నీ మీద వేరే ఆశలు పెట్టుకున్నాను. ఒక్క కూతురివి... ఇంత డబ్బు... మంచి సంబంధం తేవా లనుకున్నాను. నలుగురిలో నన్ను చిన్నతనం పడేట్లు చెయ్యకు. ఇంకా నన్ను క్రుంగదియ్యకు.'' అన్నారు.

శ్యాంకి మనసు ఇచ్చాను, మాట ఇచ్చాను. వేరే పెళ్ళి చేసుకోవటం నా తరం కాదు. నాకూ ఉంది ఆత్మ గౌరవం. నేను చేసింది తప్పు కాదు దిద్దుకోటానికి. నాన్న మాటలకి నా మనసు కరగలేదు.

''పోనీ లెండి నాన్నా నా కసలు పెళ్ళే వద్దు. మీ ఆరోగ్యం బాగుండలేదు. మిమ్మల్ని కనిపెట్టుకుని మీ దగ్గరే ఉంటాను. అంత కంటే నాకేమీ వద్దు'' అన్నాను.

''అది నాకు సంతోషాన్నిస్తుందా? పిల్లల్ని ప్రేమగా పెంచితే చివరికి ఫలితం ఇది!'' అన్నారు.

నా పట్టుదల సడలలేదు. అది స్వార్థమో సత్యమో కానీ నీరు పల్లంలోకి ప్రవేశించినట్లు, మనిషి తన జీవితానందం వేపు ప్రవహించక తప్పదు. కని పెంచిన తలిదండ్రులపట్ల ప్రేమ, అభిమానం ఉండాలి కానీ, తన జీవితానందాన్ని దూరం

చేసుకుని, కృతజ్ఞతకి కట్టుబడి ఉండటం ప్రకృతి విరుద్ధం. ఎదురీదటం లాంటిది. జీవితాంతం నిలబడేది కాదు ఆ బంధం. రెక్కలు రాగానే పిట్ట తన దిక్కు వెతుక్కుని వెళ్ళిపోవాలి.

నాన్న కోపం చివరికి విషాదంగా మారింది.

''నీ ఇష్టప్రకారమే కానీ...చివరికి ఈ తృప్తైనా మిగలనీ.... పెళ్ళి నేనే చేస్తాను'' అన్నారు.

పెళ్ళి ఏర్పాట్లన్నీ జరిగాయి. చుట్టాలు చాలామందే వచ్చారు. లోలోపల వింతగా ఉన్నా మగ పెళ్ళి వారిని బాగానే కలుపుకుని మర్యాదలు చేశారు. శ్యాం వైపువాళ్ళు ఎక్కువ మంది లేరు కూడానూ. తల్లి, అతని అక్కగారి కుటుంబం వచ్చారు.

పెళ్ళి పందిట్లో సన్నాయి మేళాల మధ్య ఇద్దరం దంపతులమయ్యాం, తల మీద చేయి వేసి ప్రమాణాలు చేయిస్తుంటే నాలో నేను...

''ఎల్ల వేళలా నిన్ను నీ నీడలా అనుసరిస్తాను నేను. నా ఆనందం, అనురాగం అన్నీ నువ్వే. అట్లాగే అనురాగంతో నన్ను నీ దాన్నిగా చేసుకో'' అనుకున్నాను శ్యాంని నా మనసులో నిలుపుకుని.

అతడి చూపులు కూడా మమత నింపుకుని నా చుట్టూ అల్లుకుపోతూ ''ఇంకనించి మనిద్దరం ఒకటే'' అన్నాయి.

ఆ క్షణాలు గుర్తు వస్తే ఇప్పుడు కూడా మనసు మాధుర్యంతో నిండిపోతుంది. మా మధ్య అప్పుడప్పుడు ఏవో అభిప్రాయ భేదాలు వస్తుంటాయి. అది సహజం. ఏ ఇద్దరికైనా వస్తాయి తప్పదు. కానీ ఒకరంటే ఒకరికి ప్రేమ అభిమానం ఉండటం వలన తేలికగా సర్దుకు పోతుంటాము. నిజమైన ప్రేమ పెళ్ళి అయ్యాకే ఆరంభిస్తుంది దానికి వయసుతో నిమిత్తం లేదు. మనసుతో తప్ప. పెళ్ళితో ప్రేమ ఆఖరు అంటే నేను ఒప్పుకోను. జీవితాన్ని ప్రేమించే వాళ్ళెవరూ ఒప్పుకోరు. రోజులు గడుస్తుంటే జీవితం ప్రేమకి ఎన్నో అర్థాలనిస్తుంది. ఎన్నో రంగుల్ని పూస్తుంది.

ప్రేమించటానికి మనసు సిద్ధంగా ఉండాలి అంతే.

* * * *

పెళ్ళి తంతు అంతా పూర్తయింది. కుసుమని తీసుకుని లోపలికి వెళ్ళాను. కుసుమ అలిసిపోయినట్లు మంచం మీద పడుకుంది చేతిని మంగళసూత్రాల మీదికి పోనిచ్చి—

''అంతా అయిపోయింది కదూ అక్కా'' అంది.

చురుక్కు మన్నట్లు చూశాను దాని వైపు.

''ఔను అయిపోయింది నీకు అతడి గురించి ఏమీ తెలియకుండానే అంతా ఐపోయింది'' అన్నాను.

''ఏమిటి తెలియాలి? అసలు ఇంకొక మనిషిని గురించి మనం తెలుసుకో గలమా? పరిస్థితులతో మనసులు మారిపోతుంటాయి! అంతేగా మనుషులంటే? ఎటువంటి వాడైనా అతడితో కలిసి బ్రతకటానికి నిశ్చయించుకున్నాక ఇంక ఆలోచన అనవసరం'' అంది.

''నాకు ఆశ్చర్యంగా ఉంది. అసలు నీకు పెళ్ళిని గురించి ఏ ఉద్దేశాలూ లేవూ... నువ్వు మనస్పూర్తిగా ఇష్టపడి చేసుకున్నావూ? ఇష్టాయిష్టాలు లేకపోవటానికి నువ్వు బొమ్మవి కాదుగా'' అన్నాను.

వెంటనే ఏమీ అనలేదు కుసుమ. తరవాత నవ్వి...

''అంతా అయిపోయాక ఆ విషయాలు చర్చించటం అనవసరం. నేను అతడికి అనుకూలంగా మారటానికే నిశ్చయించుకున్నాను.'' అంది.

''నాకు కావలసింది ఆ మాట కాదు. ఎట్లాగూ ఒకరి కొకరు అనుకూలంగా నడుచుకోక తప్పదు సంసారంలో చదువుకున్నదానివి. ఏ సంగతులూ తెలుసుకోకుండా తెలియని వ్యక్తిని ఎట్లాగ ఒప్పుకున్నావని? బొమ్మల పెళ్ళికి మనుషుల పెళ్ళికి తేడా ఏమిటి అని? ఇద్దరికీ పడకపోతే జీవిత కాలమంతా సర్దుకుపోవటానికి చాలదు. రెండు జీవితాలు వృథా!'' కుసుమ లేచి గోడకి దిండు ఆనించి కూర్చుంది.

దాని మొహంలో నిర్లిప్తత తొలగిపోయింది. కళ్ళలోకి ఆవేశం వచ్చి నిలిచింది. ''ఒక స్నేహితురాలి ద్వారా నాకు ఆనంద్‌తో పరిచయమైంది. పరిచయం స్నేహంగా మారి పెళ్ళి చేసుకోవాలనే అభిప్రాయానికి వచ్చాం. అమ్మకి, నాన్నగారికి ఇష్టంలేకపోయినా సరే. అతడు లేకపోతే బ్రతకలేననుకున్నాను ఆ క్షణాలలో కానీ అతడిది మన కులంకాదు. అప్పుడు నిన్ను ఆదర్శంగా భావించుకున్నాను నేను.

నాన్నగారు ఈ సంబంధం గురించి చెప్పి, పెళ్ళి చూపులకి వస్తారని చెప్పిన రోజు నేను అమ్మకి నా నిశ్చయాన్ని తెలియజేశాను. ఆనంద్ గురించి చెప్పాను. అమ్మ తెల్లబోయింది. నాన్నగారు నా దగ్గరికి వచ్చారు.

''చూడు తల్లీ నీ మనసు కష్టపెట్టాలనుకునే దుర్మార్గుణ్ణి కాదు నేను. కానీ ఏం చెయ్యను తల్లీ. మనం ఉండే సంఘాన్ని కాదని బ్రతకలేం మనం. నువ్వు పెళ్ళి చేసుకుని వెళ్ళిపోతావు. మేము దానికి అలవాటు పడతాం. కానీ ఇంకా నీకు ఇద్దరు చెల్లెళ్ళు ఉన్నారు. వాళ్ళకి పెళ్ళిళ్ళు కావు. అవటం కష్టం. వాళ్ళు చెయ్యని నేరానికి వాళ్ళు ఆ శిక్ష అనుభవించాలి. న్యాయమే నంటావా తల్లీ.'' అని అడిగారు.

ఇంట్లో ఎంత డబ్బు ఇబ్బందులు వచ్చినా ఎవరికి సుస్తీలు చేసినా, ఏ సమస్య వచ్చినా నాన్నగారు ఎప్పుడూ తొణకలేదు. అటువంటి నాన్నగారి కళ్ళలో తడి! నేనెంత పాపాత్మురాలిని కదూ స్వార్థంతో ఇంకేమీ ఆలోచించలేకపోయాను.

నీ సంగతి వేరు. నువ్వు మీ నాన్నకి ఒక్కతెవే కూతురివి. చెల్లెళ్ళకి పెళ్ళి కాదన్న బెంగ లేదు. మా పరిస్థితులు వేరు. డబ్బు కూడా లేదు బాగా కట్నాలు

ఇచ్చి పెళ్ళి చెయ్యటానికి. నాన్నగారి కంట్లో తడి నాలో స్వార్థాన్ని పారద్రోలింది. వివేకం మేల్కొంది.

''నాకు ప్రేమ వద్దు. తీయటి ఊహలు వద్దు. నాన్నగారిని బాధపెట్టలేను. జీవిత మంటే స్వార్థం కాదు. ఇంకా విశాలమైంది. నిర్వచించలేనిది!''

కానీ నాకు ఒక బాధ్యత మిగిలి ఉంది. త్యాగం చెయ్యటానికి నేను సిద్ధపడినా, ఆనంద్ అంగీకారం పొందాలి. వెంటనే వెళ్ళి అతడికి పరిస్థితి వివరించాను.

''సుఖపడు నీవైనా'' అనలేదు అతడు. నిందించాడు, నన్నే కాదు. స్త్రీ జాతి నంతటినీ కలిపి అన్నాడు. నాది తప్పు కాదనను. కానీ– అతడు

''మీ ఆడవాళ్ళంతే, చపలచిత్తలు. ఒకడిని పూర్తిగా మరిచిపోయి, మరు క్షణంలోనే ఇంకొకడిని ప్రేమిస్తారు. నేను మాత్రం నిన్ను మరిచిపోలేను. ఏ రైలు కిందో, లేదా సయినయిడ్ తాగి...'' అన్నాడు.

ఒక క్షణం నిలువునా వణికిపోయాను. ఏం చెయ్యాలో తోచక పిచ్చిదాన్నయి పోతానేమో అనిపించింది. అతడితో ఎక్కడకైనా వెళ్ళిపోదామా అనిపించింది. అప్పుడే అతడంటే అప్పటివరకు నాకున్న అభిమానం పోయి, అసహ్యం వేసింది. ఎంత బలహీనుడు! కష్టసుఖా లంటే అవగాహన లేదు. స్థైర్యం లేదు. ప్రేమ అంటే తనను మించి ఆలోచించలేని బలహీనత కారాదు. జీవితానికి ప్రేమ వెలుగునిస్తుంది కాని మిగతా విలువలు మరిచిపోతే ఆ వెలుగు ఆరిపోతుంది. త్యాగం చేసే శక్తి లేనివాళ్ళు ప్రేమించలేరు. ''ప్రయత్నిస్తే తప్పకుండా మరిచిపోగలవు.'' అని చెప్పి వచ్చేశాను. నా మీద విరక్తో పిరికితనమో అతడు ఏ అఘాయిత్యమూ చెయ్యలేదు. మామూలుగానే ఉన్నాడు.

అతడిని మరిచిపోవటం నాకేం కష్టం కాలేదు. అతడిని ప్రేమించటం ఒక భ్రాంతి మాత్రమే అనిపిస్తుంది ఇప్పుడు.

మనస్ఫూర్తిగా ఒప్పుకున్నాను ఈ పెళ్ళికి.

సంబంధం నిశ్చయం చేసుకోటానికి వచ్చిన రోజు... ప్రెజెంటేషన్ కొంటానని నన్ను ఒక్కతెనే బజారుకి తీసుకువెళ్ళారు ఈయన. నాకు నచ్చిన చీర కొన్నారు. అక్కడి నుంచి హోటల్‌కి వెళ్ళాము. కాఫీ తాగుతూ..

''నీకు నేను పూర్తిగా నచ్చానా? నీకిష్టమేనా ఈ పెళ్ళి'' అన్నారు.

నేను సమస్యలో పడ్డాను... జరిగింది చెప్పటం మంచిదా? కాదా?

మనసులో సంఘర్షణకి నా కళ్ళు అర్ద్రమయ్యాయి. బలవంతంగా పెదవులు విప్పి ''నాకు పూర్తిగా ఇష్టం. కానీ మీతో కొన్ని సంగతులు చెప్తాను'' అన్నాను చెప్పటానికే నిశ్చయించుకున్నాను.... తరువాత ఏమైనా సరే అనిపించింది. ఏమని మొదలు పెట్టి ఎట్లాగ పూర్తి చేశానో నాకే తెలీదు. అప్పటికే నా మీద నాకు నమ్మకం, భవిష్యత్తు మీద ఆశ. అతడి మీద గౌరవం, నమ్మకం ఏర్పడిపోయాయి..... నాలో భయం తీరిపోయింది. ధైర్యం వచ్చింది. అతడేమంటాడోనని రెప్పలు ఆర్పకుండా అతడినే చూస్తున్నాను.....అతడు లేచి, నాకు చెయ్యి అందించాడు.

''ఇప్పుడు నీ మనసులో బరువు తీరిపోయిందా?'' అన్నాడు.

''ఆ బరువు మీ మనసులో ప్రవేశించకుండా ఉంటేనే.'' అన్నాను.

''మనవి బాల్య వివాహాలు కావు... ఎన్నో మానసిక సంఘర్షణలని ఎదుర్కోవాల్సి ఉంటుంది అర్థం చేసుకోవాల్సి ఉంటుంది. నువ్వు నిజంగా మంచి పిల్లవి'' అన్నాడు... ఇంటికి వచ్చేశాం. పెళ్ళి నిశ్చయమైంది. నా మనసు సంతోషంతో నాట్యం చేస్తోందని సెలయేరులా ప్రవహిస్తోందని అనలేను. నా మనసులో సంతృప్తి దీపం లాగా వెలుగుతోంది... చమురుతో నిండి ఉన్న దీపం లాగా వెలుగుతోంది అని మాత్రమే అనగలను! మరి ఈ పెళ్ళికి నువ్వు ఏమని పేరు పెడతావో కానీ....'' అని చెప్పటం ఆపింది కుసుమ.

కుసుమ వైపు రెప్పపాటు లేకుండా చూశాను.

''నాకు మాటలు రావటంలేదే. ఇది బాధో, ఆనందమో తెలీటం లేదు. మీరిద్దరూ చిరకాలం సుఖంగా వైవాహిక జీవితం గడపాలని ఆశీర్వదిస్తున్నాను'' అన్నాను దాని చేతిని నాచేతిలోకి తీసుకుని.

* * * *